క్లుప్తంగా

నేటి నుంచి పలుకుదొడ్డిలో ఉరుసు



పలుకుదొడ్డిలో బడేసావ్ ఖాద్రీ దర్గా

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు బడేసావ్ ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు, సోమవారం కిస్తీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి



కొత్రపోలూరులో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

గడివేముల: మండల పరిధిలోని కొత్రపోలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. ఆయన శుక్రవారం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను తనిఖీ చేశారు. సర్వే చేసే పొలానికి సంబంధించి యజమాని రైతులకు ఒక రోజు ముందుగానే సమాచారం అందించాలన్నారు. రైతు పొలం హద్దులను చూపించిన అనంతరం వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. రీ సర్వేలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సర్వేయర్లకు సూచించారు. రైతుల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ హరికృష్ణ, సర్వేయర్ మధు, వీఆర్వో అనిల్‌కుమార్ రెడ్డి, గ్రామ సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి యువజనోత్సవం

కల్లూరు:దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు, ఏపీలోని పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, ఐఐఐటీ డీఎం డాక్టర్ సత్యబాబు, కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాడెంట్ విజయలక్ష్మి హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

ఉపాధి పథకానికి సంకెళ్లు



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకెళ్లు వేస్తున్నాయని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం కల్లూరు మండలం ఉలిందకొండలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మా ట్లాడారు. కూలీలకు తొమ్మిది వారాలైనా వేతనాలు ఇవ్వలేదన్నారు. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు సరఫరా చేయాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోతే రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు(రూరల్): కర్నూలు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం



ఉపాధ్యాయినులను సన్మానించిన ఎంఈఓలు

కోడుమూరు రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాలుర హైస్కూల్‌లో ఉపాధ్యాయినులను ఎంఈఓలు తైమూర్‌బాషా, వసంతలక్ష్మి శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు.

సంతాన వరదుడు..చెన్నసోమేశ్వరుడు!

- పోలకల్‌లో స్వయంభుగా వెలసిన స్వామి వారు
- నేడు పుష్ప రథోత్సవంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ఎనిమిది రోజులపాటు వైభవంగా సాగనున్న వేడుకలు

సి.బెళగల్ మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన చెన్నసోమేశ్వర స్వామి సంతానవరదుడిగా వెలుగొందుతున్నాడు. పార్వతీ, గంగాదేవి, చాముండేశ్వరి సమేతంగా కొలువైన చెన్న సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. 8 రోజుల పాటు జరిగే వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 14వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున మహా రథోత్సవం, 15న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. – సి.బెళగల్

శ్రీకృష్ణదేవరాయలు పాలన కాలంలో తుంగభద్ర నది తీరం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలకల్ గ్రామానికి పశువుల కాపర్లు వచ్చేసరికి రాత్రి కావడంతో తమ పశువుల మందను గ్రామంలో నిలిపివేసుకున్నారు. ఆ రాత్రి పశువులకు మేతవేసిన గాడుపాడులో శిల స్వయంభుగా, గంభీర శబ్దంతో భూమి నుంచి ఉద్భవించిందని, పశువుల కాపర్లు భయభ్రాంతులకు గురయ్యారని, ఈ సమయంలో సోమేశ్వర స్వామి దర్శనం ఇచ్చి కాపర్లకు పూజలు నిర్వహించాలని చెప్పారని పెద్దల నానుడి. అప్పటి నుంచి నేటి వరకు నిత్యం శ్రీ చెన్నసోమేశ్వర స్వామి వార్లు పూజలు అందుకుంటూ విరాజిల్లుతున్నారు.

పెరుగే ప్రసాదం..

స్వామి వారి రథోత్సవం ముందురోజు గొల్లలు నిష్టతో తుంగభద్ర జలాలను, మట్టి కడవలలో ఆలయం చేర్చే సందర్భంలో ఎదురుగా వచ్చే గొర్రెల నుంచి రెండు పాలధారలను నది నీటిలోకి పితికి తీసుకువస్తారు. అనంతరం పాలతో కూడిన కడవలను ఆలయంలో ఉంచుతారు. ఈ తుంగభద్ర జలాలు రథోత్సవం అనంతరం పెరుగుగా మారుతుందని, ఈ పెరుగును ప్రసాదంగా స్వీకరించిన వారికి (సంతానం లేని వారికి) సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో జిల్లా నలుమూలల నుంచే గాక పొరుగున ఉన్న కర్ణాటకా, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన భక్తులతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రసాదం స్వీకరిస్తారు.



చెన్నసోమేశ్వర స్వామివారి ఆలయంలో దేవతామూర్తుల కవచాలు

ఉత్సవాలు ఇలా..

ఉత్సవాల్లో భాగంగా 8, 9, 10 తేదీలలో పుష్ప రథోత్సవాలను నిర్వహిస్తారు. 11, 12వ తేదీలలో ప్రభోత్సవం, తోలు బొమ్మలాట కార్యక్రమాలు ఉంటాయి. 13న చలువ కాగులను యాదవులు ఊరేగింపుగా ఆలయం చేరుస్తారు. 14న తెల్లవారుజామున సంపూర్ణ మహా రథోత్సవం ఉంటుంది. అదేరోజు పారువేట, రాత్రి తోలు బొమ్మలాట కార్యక్రమాలు ఉంటాయి. 15న వసంతోత్సవం, అదేరోజు సాయంత్రం పెద్ద బావిలో స్వామివారి ఉత్సవ మూర్తుల చక్రస్నానంతో ఉత్సవాలకు ముగింపు పలుకుతారు.

- ఉత్సవాల్లో భాగంగా 13, 14, 15వ తేదీలలో ఆలయ ధర్మ కర్తలు, గ్రామ పెద్దలు, ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన ఏర్పాటు చేయనున్నారు.
- 13న రాత్రి రేలారేలా సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నాటకాలు, మిమిక్రీ, సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయి.
- 14న రాష్ట్రస్థాయి పాలపండ్ల సైజు ఎద్దులు బండలాగుడు పోటీలు, 15న క్యాటగిరి సైజు ఎద్దులు బండలాగుడు పోటీలు ఉంటాయి.

ప్రశాంతంగా జరుపుకోవాలి



పోలకల్‌లోని శ్రీ చెన్న సోమేశ్వరస్వామి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ఇందుకోసం ఇప్పటికే నిర్వాహకులకు సూచనలు చేశాం. ప్రత్యేక కార్యాచరణతో స్వామి దర్శనం, దుకాణాల ఏర్పాటు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పెద్ద సంఖ్యలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తాం. ఉత్సవాలకు ఆటంకం కలుగజేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– తిమ్మారెడ్డి, సి.బెళగల్ ఎస్ఐ

సర్వే త్వరగా పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వర్కింగ్ ఫ్రమ్ హోం సర్వేను ఈనెల 8లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాముడు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని లద్దగిరి గ్రామంలో ఎంపీడీఓ రాముడు పర్యటించి సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వర్కింగ్ ఫ్రమ్ హోం సర్వేను సిబ్బంది అంతా ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో భాగంగా ఆయా కుటుంబాల్లో ఎవ్వరైనా పిల్లలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పనిచేస్తుంటే వారి వివరాలను పొందుపర్చడంతో పాటు, ఎవ్వరికైనా టెక్నాలజీపై శిక్షణా కార్యక్రమాలు కావాలన్న వారి వివరాలను పొందుపర్చాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించి సర్వే వివరాలను అందజేయాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంట లద్దగిరి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

పొగాకు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



కంపెనీ సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- క్వింటాల్‌కు రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలి
- ఐటీసీ కంపెనీ అధికారులతో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని

ఓర్వకల్లు: పొగాకు రైతులను ఇబ్బందికి గురిచేయకుండా దిగుబడులు కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఐటీసీ కంపెనీ అధికారులకు సూచించారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఐటీసీ కంపెనీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు రైతులు నష్టపోకుండా కొనుగోలు చేయాలని ఐటీసీ అధికారులకు సూచించారు. దిగుబడులను నాణ్యత ప్రమాణాలతో ముడిపెట్టి రీ బేల్ చేయకుండా సగటున ప్రతి బేల్‌ను ఏదో ఒక ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఒక బేల్ కనిష్ఠంగా రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో, రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. అంతకు ముందు కాటసాని గుట్టపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, హుసేనాపురం మాజీ సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జీకే వెంగన్న, పాల మధు, ఓర్వకల్లు మాజీ పీఎంసీ చైర్మన్ రోళ్లపాడు మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పీ–4 సర్వేను వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వం సచివాలయాల పరిధిలోని క్లస్టర్లలో చేపట్టిన సాధికార (పీ–4) సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో 1, 2 సచివాలయాల పరిధిలో జరుగుతున్న పీ–4 సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని కుటుంబాల్లో సర్వే చేశారు. చేపట్టాల్సిన కుటుంబాల పురోగతిని సర్వే బృందాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వివిధ పథకాల కింద ఆర్థిక సాయం అందించేందుకు ప్రజల స్థితిగతులు, వారి జీవన విధానాన్ని మెరుగు పరిచేందుకు అవసరమైన సదుపాయాలు గుర్తించి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో నిర్దేశించిన సర్వేలను వేగిరం చేయాలని సూచించారు. అదేవిధంగా శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ వారు గ్రామ, సచివాలయ పరిధిలో గల బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, కాపు, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, బలిజ కులాల మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఆసక్తి గల మహిళలు సమీపంలోని సచివాలయాల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- నంద్యాల ఆర్‌టీఓ ఐశ్వర్య రెడ్డి



విద్యార్థినులతో నంద్యాల ఆర్‌టీఓ ఐశ్వర్య రెడ్డి

పాణ్యం: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని నంద్యాల ఆర్‌టీఓ ఐశ్వర్య రెడ్డి సూచించారు. మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం ఫార్మసీ, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించాలన్నారు. నాయకత్వ పాత్రల్లో మంచి అవకాశాలు పొందాలన్నారు. సైబర్ భద్రత, డేటా సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. మహిళా కో–ఆర్డినేటర్లను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం మట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వారి పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మహిళా సాధికారత సెల్ సమన్వయకర్త నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కర్నూలు(రూరల్): చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పీఎంయూ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్ర విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని గార్గేయపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు మానసిక ఒత్తిడిడి జయించడంపై కౌన్సిలర్ ఎం.సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయేంద్ర మాట్లాడుతూ పరీక్షలను ప్రశాంతంగా రాయాలన్నారు. జిల్లా జీసీడీ స్నేహలత మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఒక కౌన్సిలర్‌ను కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండేలా, చెడు అలవాట్లకు లోను కాకుండా కౌన్సిలర్ అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరాముడు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు యాగంటీశ్వరుడు

- నేటి నుంచి కొంతలపాడులో ఆరాధనోత్సవాలు
- 10న తెల్లవారుజామున రథోత్సవం
- ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



ఆలయ ప్రాంగణంలో పురాతన కోనేరు



కొంతలపాడులోని యాగంటీశ్వరస్వామి ఆలయ క్షేత్రం

ఓర్వకల్లు: ధర్మ సంస్థాపనార్థం భారత నేలపై ఎంతో మంది మహానుభావులు జన్మించారు. అలాంటి ఆధ్యాత్మిక రత్నాలలో ఒకరైన దైవాంశ సంభూతునిగా వెలసిన యాగంటీశ్వరస్వామి భక్తుల పాలిట మహిమాన్వితునిగా విరాజిల్లుతున్నారు.

ఆలయ ప్రస్థానం

దాదాపు 300 ఏళ్ల పూర్వం మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో ఆధ్యాత్మిక సేవలో పరితపించిన యాగంటయ్యాచార్యులు తపస్సంపన్నుడిగా జీవించి, అవధాతగా మారి దైవ సన్నిధిలో సజీవ సమాధి అయ్యారు. ఈయన జన్మస్థలం వెల్దుర్తి మండలం, కొడిదికుంట్ల కిష్టాపురం. బాల్యం నుంచి భక్తి, జ్ఞాన, వైరాగ్యంపై మక్కువ ఏర్పడింది. తద్వారా మనస్సు, వాక్కు, కాయములు త్రికరణశుద్ధి కలిగియున్నట్లు భక్తులు విశ్వసిస్తారు. ఆయన వాక్కు నుంచి వెలువడిన ప్రతి మాట తప్పక జరుగుతూ వచ్చిందని స్థానికుల అభిప్రాయం. అంతేగాక యాగంటయ్యాచార్యుల వారు శివుని అనుగ్రహం ద్వారా సంపూర్ణ జ్ఞానస్థితిని పొంది జీవబ్రహ్మైక్యం గావించి సజీవ సమాధి అయినట్లు పూర్వీకుల నానుడి. శివపంచాక్షరి మహా మంత్రం ఉపాసాన చేయడం వల్ల యాగంటయ్యాచార్యులకు యాగంటీశ్వర స్వామిగా నామకరణం స్థిరపడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. నాటి నుంచి నేటి వరకు అఖండ ధూపదీప నైవేద్యాలతో భక్తులచే విశిష్ట పూజలు అందుకుంటూ దైవ స్వరూపునిగా విరాజిల్లుతున్నారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వారం రోజులకు స్వాముల వారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించడం అనాదిగా వస్తోంది.

నేటి నుంచి స్వాముల వారి ఆరాధనోత్సవాలు

అంబాసహిత యాగంటీశ్వర స్వామి ఆరాధనోత్సవాలు శనివారం నుంచి శాస్త్రోక్తంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, ధూపదీప నైవేద్యార్చణ అనంతరం పాలకొలను శివారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపం నిమిత్తం సీతారాముల బృందం వారిచే చెక్కభజన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

ఆదివారం తెల్లవారుజామున ప్రభోత్సవం

ఆరాధనోత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున నంది వాహనంపై స్వాములవారికి ప్రభోత్సవం జరుగుతోంది. అదేరోజు పగలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. రాత్రి ఈటీవీ జబర్దస్త్, మా టీవీ రేలారే రేలా బృందం వారిచే సినీ సంగీత విభావరి వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

10న రథోత్సవం

యాగంటీశ్వర స్వామి రథోత్సవం ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం స్వాముల వారికి అభిషేకార్చనలతో పాటు దూపదీప నైవేద్యాలు సమర్పించిన తర్వాత మధ్యాహ్నం కర్నూలు, కొంతలపాడు గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం సాధారణ పూజలతో పాటు స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి సాయంత్రం పారువేట, నందికోల సేవ, పల్లకీ ఉత్సవంతో స్వాముల వారి ఆరాధన మహోత్సవాలు ముగుస్తాయని ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు వెల్లడించారు.

స్వాముల వారి విశిష్టత

- యాగంటయ్య స్వాములవారి జీవిత చరిత్ర వీరబ్రహ్మేంద్రస్వాముల వారి చరిత్రను పోలివుండుట.
- కొంతలపాడు గ్రామం వెలుపల మూడు నదులు, మూడు గ్రామాల పొలిమేరలు కలిసే చోట జీవసమాధి కావడం
- గ్రామరెడ్డిని అరెస్టు వారెంటు నుంచి కాపాడడమేగాక, సంతాన ప్రాప్తిని ప్రసాదించడం
- గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు గడ్డివాములను మంటల నుంచి కాపాడటం
- 12 తులముల కరిగిన బంగారు నీరును సేవించి మరల వెలికి తీయడం
- సున్నమును అన్నముగాను, కప్పలను అప్పలుగా చేయడం, ఆయన స్వరూపమును తానే స్వయంగా గంభీరమైన విగ్రహమును తయారు చేసుకోవడంతో స్వాములవారు ప్రాముఖ్యతను కలిగియున్నారు.



ఆలయంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

10న వృషభాల బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో ఈ నెల 10వ తేదీన అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు రైతు సంఘం నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని యాగంటీశ్వర స్వామి తిరునాల సందర్భంగా రైతుల్లో ఉత్సాహం నింపేందుకు నిర్వహించే పోటీలలో గెలుపొందిన వృషభ యజమానులకు తొలి ఐదు స్థానాలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వృషభాల యజమానులు అదే రోజు ఉదయం 7 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. మరిన్ని వివరాలకు 97013 38439, 99636 28175 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో ఆదివారం విద్యాదాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరానికి ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్లతో పాటు ఎముకలు, కంటి, న్యూరో సర్జన్ డాక్టర్లు హాజరై వైద్య సేవలందిస్తారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం



హంద్రీ నదిలో మురుగును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజలు

కల్లూరు: నగర శివారులోని దూపాడు వద్ద హంద్రీ నదిలో మురుగు నీరు కలుస్తున్న ప్రదేశాన్ని ఇరిగేషన్, పొల్యూషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. దూపాడు సమీపంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వస్తున్న వ్యర్థాలతో హంద్రీ నది కలుషితమవుతోందని గత వారం సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. దీంతో అధికారులు శుక్రవారం హంద్రీ నదిని పరిశీలించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. సీపీఎం నాయకులు కృష్ణ, మధు, హరిబాబు, షేక్షావలి తదితరులు ఉన్నారు.